క్లుప్తంగా

మంచినీటి ట్యాంకుకు శంకుస్థాపన



వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ అచ్యుతశివాజీ, నాయకులు

నల్లజర్ల: మండలంలోని ఆవపాడు పంచాయతీ పరిధిలోని కొత్తపేటలో నిర్మించే 40 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకుకు వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ బుధవారం శంకుస్థాపన చేశారు. మంచినీటి ట్యాంకుతో పాటు పైప్‌లైన్ విస్తరణ పనులకు రూ.41లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులను కేటాయించారు. కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, బంక అప్పారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు నిడదవోలు మండల పరిషత్ సమావేశం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ బుధవారం తెలిపారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

బంగారుకొండ కిట్ల పంపిణీ



బంగారుకొండ కిట్లు అందిస్తున్న అయినీడి పల్లారావు

నిడదవోలు రూరల్: పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసే లక్ష్యంతో బంగారుకొండ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో పల్లారావు బుధవారం చిన్నారుల తల్లులకు బంగారుకొండ కిట్లు అందజేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఉపసర్పంచ్ కీర్తి శ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలోని అచ్చన్నపాలెంకు చెందిన పిన్నమనేని షణ్ముఖ సాయిలక్ష్మి ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ సెకండియర్ చదువుతోంది. ఆమెకు మానవత సంస్థ మండల శాఖ విద్యానిధి పథకం కింద బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో మానవత సంస్థ మండలశాఖ చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, పాతూరి సత్యనారాయణ, గుత్తికొండ వరప్రసాద్, ఎస్.రాజేంద్రప్రసాద్, గుండు త్రినాథమూర్తి పాల్గొన్నారు.

దేవరపల్లి మండల శాఖకు విరాళం

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మండల శాఖకు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి, విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బలుసు సత్యనారాయణ రూ.50 వేలు విరాళంగా అందజేశారు. విరాళాన్ని మండల శాఖ అధ్యక్షుడు ఈడ్పుగంటి నాగేశ్వరరావుకు అందజేసినట్టు బుధవారం ఆయన తెలిపారు. పల్లంట్ల గ్రామంలోని శాంతిరథం నిర్వహణకు ఈ నిధులు వినియోగించనున్నట్టు సత్యనారాయణ చెప్పారు.

లారీ, వ్యాన్ ఢీ: ఒకరికి గాయాలు



దొరసానిపాడు శివార్లలో ఢీకొన్న లారీ, వ్యాన్

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడు శివార్లలో బుధవారం లారీ, పాల వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం, భీమడోలు మండలం గుండుగొలను నుంచి తిరుమల పాల వ్యాన్ అశ్వారావుపేట వెళుతోంది. అలాగే కామవరపుకోట నుంచి తిమ్మాపురానికి ఒక లారీ వెళుతోంది. ఇదిలా ఉంటే ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

నేస్తంలా నేనున్నానని..

- కాపు నేస్తం పథకంతో మహిళలకు లబ్ధి
- నిడదవోలు నియోజకవర్గంలో 5,434 మందికి మేలు
- 30న సీఎం జగన్ చేతుల మీదుగా ఖాతాల్లోకి జమ



నడుపల్లిలో కాపు మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు (ఫైల్)

పెరవలి: ఇప్పటికీ నడి వయసు మహిళలు తమ ఆర్థిక అవసరాల కోసం భర్త, లేదా పిల్లలపై ఆధార పడే పరిస్థితిని చాలాచోట్ల చూస్తున్నాం. వారు కేవలం వంటింటికే పరిమితం. అంతకు మించి పిల్లలను కని, పెంచి పెద్ద చేసే యంత్రాలు మాత్రమే అనే చాంధస భావనలు చాలామందిలో ఉన్నాయి. వాస్తవంగా ఆర్థికంగా ముందంజ వేయగలిగినపుడే ఏ సామాజిక వర్గమైనా అభివృద్ధి చెందుతుంది. ఇది మతాలకు, సామాజిక వర్గాలకు మాత్రమే వర్తించే విషయం కాదు. మహిళలకు కూడా వర్తిస్తుంది. ఆర్థిక స్వావలంబన సాధించగలిగితేనే ఆ కుటుంబం భవిష్యత్తులో వృద్ధిలోకి వస్తుంది. ఇదే ఉద్దేశంతో రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాపు నేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టింది. రాష్ట్రంలోని అగ్రవర్ణాల్లో ఒకటైన కాపుల్లో కాస్త వయసు మళ్లిన మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ అంతంత మాత్రం. ఏ చిన్న అవసరానికి కైనా కుటుంబ సభ్యుల వద్ద చేయి చాపాల్సిన పరిస్థితి. అందుకే జగన్ ప్రభుత్వం ఇప్పటికే మూడేళ్ల పాటు కాపు నేస్తం పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న 45 నుంచి 60 సంవత్సరాల వయసున్న కాపు మహిళల బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.15,000 చొప్పున జమ చేస్తోంది. ప్రభుత్వ పింఛను పొందని వారు, తెల్లరేషన్ కార్డు ఉన్న వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఈ ఏడాది నాలుగో విడత కాపు నేస్తం సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 30న నిడదవోలులో మీట నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ములను జమ చేయనున్నారు.

నియోజకవర్గంలో అర్హుల సంఖ్య	
నిడదవోల్ టౌన్	478
నిడదవోలు మండలం	1,618
ఉండ్రాజవరం మండలం	1,124
పెరవలి మండలం	2,314
మొత్తం	5434

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

నిడదవోలు నియోజకవర్గంలో సుమారు 35 వేల మంది కాపు మహిళలు ఉన్నారు. వారిలో 45 ఏళ్ల వయసు పైబడిన 5,434 మంది మహిళలకు కాపు నేస్తం పథకం ద్వారా లబ్ధి చేకూరుతోంది. ఈ పథకం ద్వారా ఈ ఏడాది రూ.8.15 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ కానుంది. కాగా
ఈ పథకం కింద నియోజకవర్గంలోని అర్హులను గుర్తించడంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు కీలక పాత్ర పోషించారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా వలంటీర్లకు ఆయన ఆదేశాలు ఇచ్చారు.

మహిళలకు నేరుగా లబ్ధి



కాపునేస్తం పథకం ద్వారా కాపు మహిళలకు నేరుగా మేలు చేకూరుతోంది. ఏడాదికి రూ.15 వేల చొప్పున వారి ఖాతాలకు జమ చేయడం ఎంతో మంచి పని. సీఎం జగన్ చెప్పినట్టుగానే పాలన సాగించడం ఆనందదాయకం

– యనమల సూర్యకుమారి, లబ్ధిదారు, కానూరు

కాపులను ఆదుకున్న నేత జగన్



ఎన్నో ప్రభుత్వాలు చూశాను. కానీ కాపులకు ఈ విధంగా ఆదుకున్న నాయకుడిని చూడలేదు. పథకం చాలా బాగుంది. మాలాంటి మహిళలు ఒకరిపై ఆధార పడకుండా కాపు నేస్తం కాపు కాస్తోంది.

– దేగల రత్నం, లబ్ధిదారు, అన్నవరప్పాడు

నేనూ లబ్ధిదారునే..



జగన్ మాట ఇస్తే నెరవేరుస్తారని విన్నాను. స్వయంగా చూస్తున్నాం. ఈ పథకం వలన వేలాది కాపు మహిళలకు మేలు జరుగుతోంది. ఈ పథకంలో నేను కూడా లబ్ధిదారును అయినందుకు ఆనందంగా ఉంది.

– కోటిపల్లి సత్యవతి, లబ్ధిదారు, అన్నవరప్పాడు

అర్హులందరికీ ప్రయోజనం



కాపునేస్తం పథకంలో అనర్హులకు చోటు లేకుండా, అర్హులను వదలకుండా సమగ్ర క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం అర్హులను ఎంపిక చేశాం. ఈ ఏడాది కొందరికి లబ్ధి చేకూరితే వచ్చే ఏడాది మరింత మంది అర్హులు పెరుగుతారు. అందరికి సమ న్యాయం చేస్తాం.

– జి.శ్రీనివాస్ నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

బీసీ సామాజిక భవనానికి రూ.25 లక్షలు

దేవరపల్లి: స్థానిక శ్రీకృష్ణ శెట్టిబలిజ సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీ మార్గాని భరత్‌రామ్ రూ.20 లక్షలు మంజూరు చేశారని ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. అలాగే మండల పరిషత్ సాధారణ నిధులు మరో రూ.5 లక్షలు మంజూరు చేశామన్నారు. మొత్తం రూ.25 లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని ఆయన తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దుర్గారావును కలిసి సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ వినతిపత్రం సమర్పించగా, ఆయన పై విధంగా బదులిచ్చారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సహకారంతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.24 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్టు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, శ్రీకృష్ణా శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడిన పోలీసు అధికారులు

నిడదవోలు: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్లో జైభీమ్ స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న వాలీబాల్ కోర్టును బుధవారం నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు, సమిశ్రగూడెం ఎస్సై ఎస్‌కే సుభానీ సందర్శించారు. అక్కడి యువతతో కలిసి వారిద్దరూ వాలీబాల్ ఆడి ఉత్సాహాన్ని నింపారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు, అధ్యక్షుడు టి.నాని, సతీష్, రాజశేఖర్, శ్రీను,పృథ్వీ, రవి, పోసి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయంగా పథకాలు

- కొవ్వూరులో మంత్రి వనిత, సమిశ్రగూడెంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..



కొవ్వూరు 18వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి వనిత



విజ్జేశ్వరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కొవ్వూరు: పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని హోం మంత్రి తానేటి వనిత ప్రజలను కోరారు. పట్టణంలోని 18,19వ వార్డులలో బుధవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో వార్డుల కౌన్సిలర్లు దేవగుప్తాపు చాందిని, వరిగేటి లలితకుమారి, పతివాడ నాగమణి, అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, స్థానిక నాయకులు వరిగేటి సుధాకర్, మైపాల రాంబాబు, గంధం శేషసాయి, పార్టీ మహిళా విభాగం పట్టణ శాఖ అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, 18వ వార్డు ఇన్‌చార్జ్ ఎండీ ఆలీ, పార్టీ పట్టణశాఖ గౌరవాధ్యక్షుడు నగ్గల్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగనన్నది సువర్ణ పాలన

నిడదవోలు రూరల్: సంక్షేమం, అభివృద్ధిలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలో బుధవారం రెండో రోజు కూడా ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆ పంచాయతీ సర్పంచ్ తిక్కా శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌ది సువర్ణ పాలన అన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలను అందించి పేదలను మోసగించారని విమర్శించారు. గత నాలుగేళ్లలో విజ్జేశ్వరంలో రూ.16.80 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.6.70 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. గ్రామ ప్రజలు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కాపకాయల శ్రీనివాస్, బద్దిల రామకృష్ణ, దేవన బాబూరావు, గొల్లకోటి పోశియ్య, రాజ్‌కుమార్, ముల్లపర్తి రాంబాబు, శ్రీనివాస్, కొట్టాల విజయ, వంకా దుర్గా, శనగన వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డాక్టర్ పద్మలత

విజ్జేశ్వరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడిని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షురాలు, బీసీ సంక్షేమ సంఘం మహిళా జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ బలోపేతంతో పాటు గ్రామీణులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి నివాళి



ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరికి నివాళులు

కొవ్వూరు: ఆంధ్రకేసరి, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరులోని ప్రాంతీయ పశు సంవర్థక శాఖ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారి ఎస్‌జీటీ సత్యగోవింద్ ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రానికి, ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ప్రకాశం బ్యారేజీ నిర్మాణం ఆయన కృషి ఫలితమే అన్నారు. పశు సంవర్థక శాఖ కొవ్వూరు ఉప సంచాలకుడు జి.రాధాకృష్ణ, ఏడీ వెంకటరెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు, పంచాయతీరాజ్ ఏఈ భగవన్నారాయణ, పాలాటి శరత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రత్యేకాధికారి కె.సత్యగోవింద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి, శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వెజ్జు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి జయంతి నిర్వహించారు.

చాగల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి టంగుటూరి ప్రకాశం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో బి.రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. చాగల్లు, చంద్రవరం శాఖా గ్రంథాలయాల్లోనూ ప్రకాశం పంతులు చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఇస్రో బృందానికి జేజేలు



కొవ్వూరు సంస్కృత పాఠశాలలో హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, బీజేపీ నాయకులు, టీచర్లు



గోపాలపురంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

- వివిధ వర్గాల హర్షాతిరేకాలు
- తిలకించి, కేరింతలు కొట్టిన విద్యార్థులు
- 'ఇస్రో'కు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అభినందనలు

నిడదవోలు: దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన విజయం. చందమామ దక్షిణ ధ్రువంపై విక్రమ్ విజయవంతంగా ల్యాండ్ కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రయాన్- 3 విజయవంతంపై ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ రంగాల నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చంద్రయాన్- 3 ల్యాండింగ్ దృశ్యాలను పాఠశాలల తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. నిడదవోలు ఎంఈఓ. గణేష్ పర్యవేక్షణలో ఇందుకు ఏర్పాట్లు చేశారు. చంద్రయాన్-3 విజయవంతం కాగానే విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకొని భారత్ మాతాకీ జై .. జై ఇస్రో అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ 140 కోట్ల మంది భారతీయుల ఆశలను సజీవంగా మోస్తూ చంద్రయాన్-3లో భాగమైన విక్రం ల్యాండర్ చందమామపై అడుగు పెట్టడం అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన అపూర్వ విజయమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కొవ్వూరు: ఇస్రో ప్రయోగించిన ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని ప్రార్థిస్తూ స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో కొలువైన గోష్పాద క్షేత్ర స్వామివారికి ఆ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు బుధవారం పూజలు చేశారు. చంద్రయాన్-3 సక్సెస్‌తో భారతదేశ జెండా ప్రపంచ పటంలో రెపరెపలాడిందని వక్తలు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, మాట్లా అంజనేయులు, కొండపల్లి రత్నసాయి, సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, ఆలయ ప్రధానార్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: చంద్రయాన్-3 విజయవంతం కావడంపై స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఇండియా అంతరిక్ష సామర్థ్యాన్ని ప్రపంచం నలుదిక్కులకూ వ్యాపింపజేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీక్షించిన విద్యార్థులు

తాళ్లపూడి: చంద్రయాన్- 3 ల్యాండింగ్ దృశ్యాలను మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై, ఎల్‌ఈడీ టీవీలపై ప్రత్యక్షంగా వీక్షించారు. ఇందుకోసం తాళ్లపూడిలోని మాంటిస్సోరి హైస్కూల్ మైదానంలో రెండు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఆ ప్రయోగం విజయవంతం అయ్యాక విద్యార్థులు జాతీయ పతాకాలు చేత పట్టుకుని 'జయహో భారత్' అంటూ నినాదాలు చేశారు.

దేవరపల్లి: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో మానవత స్వచ్ఛంద సంస్థ, విశ్రాంత ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రజ్ఞులకు అభినందనలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు లక్ష్యంగా..

చాగల్లు: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శక్తి వంచన లేకుండా పని చేస్తోందని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. మండలంలోని కలవలపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.రాంప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలపురంలో ముగిసిన పొగాకు వేలం

గోపాలపురం: గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన అమ్మకాలు, కొనుగోళ్లు బుధవారంతో ముగిశాయని వేలం నిర్వహణాధికారి కె.అమూల్ శ్యామ్ ప్రకటించారు. మొత్తం 118 రోజుల పాటు వేలం నిర్వహించగా సరాసరిన పొగాకు ధర కిలోకు రూ.248.31 లభించిందన్నారు. వేలం కేంద్రం పరిధిలో 2,303 మంది రైతులకు గానూ 2782 పొగాకు బ్యారన్లు ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది వర్జీనియా పొగాకు బోర్డు నిర్దేశించిన మేరకు మాత్రమే సాగు చేయాలని సూచించారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి టి.హేమ స్మిత, పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, రైతులు ఇల్లూరి రాంబాబు, ముల్లంగి శ్రీనివాస రెడ్డి, కూసం రామమోహన్‌రెడ్డి, దుగ్గిరాల రాంబాబు, జగదీష్ పాల్గొన్నారు.

టీడీపీ తప్పుడు ప్రచారం సిగ్గుచేటు

నల్లజర్ల: దూబచర్ల–చేబ్రోలు రహదారి గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దాంతో దూబచర్లలోని అన్ని పార్టీల వారు చందాలు వేసుకుని ఆ రహదారిని మంగళవారం బాగు చేశారు. అయితే కేవలం టీడీపీ నేతలే సొమ్ములు ఖర్చు చేసి రోడ్డు పనులు చేశారంటూ ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ మద్దిపాటి వెంకట్రాజు పత్రికా ప్రకటన ఇవ్వడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ దూబచర్ల నాయకులు తొమ్మండ్రు రమేష్, దొరబాబు బుధవారం విమర్శించారు. ఎక్కడైనా రహదారులు బాగా లేకపోతే చెప్పండి మేమే బాగు చేస్తామంటూ మద్దిపాటి ప్రకటనలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ గ్రామంలో ఏ అభివృద్ధి పని చేశారో తెలియజెప్పాలన్నారు.

ఇసుక స్టాక్ యార్డు వద్ద టీడీపీ నిరసన

కొవ్వూరు: గడువు ముగిసిన కాంట్రాక్ట్ సంస్థ పేరుతో ఇసుక అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపిస్తూ టీడీపీ మండలంలోని కుమారదేవం ఇసుక స్టాక్ యార్డు వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఆందోళన సాగింది. అనంతరం వారు బిల్లులు పరిశీలించారు. కొద్దిసేపు పార్టీ నాయకులతో కలిసి స్టాక్ యార్డు వద్ద ధర్నా చేశారు. గండిపోశమ్మ ఆలయానికి వచ్చే భక్తులు వినియోగించే ప్రాంతంలో భారీ ఎత్తున ఇసుక నిల్వలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. కాంట్రాక్టు గడువు ముగిసిన సంస్థ పేరుతోనే ఇసుక అమ్మకాలు సాగిస్తున్నారని దుయ్యబట్టారు.తక్షణం ఆ సంస్థ ఇసుక అమ్మకాలు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

ఏలూరు డివిజన్‌కు ద్వారకాతిరుమల మండలం

- ముఖ్యమంత్రి సుముఖత



తాడేపల్లిలో సీఎం జగన్‌ను కలసిన గన్నమని వెంకటేశ్వరరావు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. జిల్లాల విభజన అనంతరం గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారాతిరుమల మండలాన్ని ప్రజల సౌలభ్యం కోసం ఏలూరు జిల్లాలో విలీనం చేశారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ డివిజన్‌గా జంగారెడ్డిగూడెంలో ఉంచారు. దీనివల్ల సమస్యలు ఎదురవుతునన్నాయి. ద్వారకాతిరుమల మండలాన్ని ఏలూరు డివిజన్‌లో కలపాలని జీవీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. అలాగే నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయం భవనాల నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని, నల్లజర్ల మండలం పోతవరం సీతమ్మ ఆవ చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, నియోజకవర్గంలోని నాలుగు మండలాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జీవీ కోరారు. అందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు జీవీ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు: సొత్తు రికవరీ



చోరీ కేసులో అరెస్టయిన నిందితులు, రికవరీ చేసిన సొత్తుతో ఎస్సై, పోలీసులు

తాళ్లపూడి: చోరీ కేసులో నిందితులు ఇద్దరిని తాళ్లపూడి పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అన్నదేవరపేటకు చెందిన జాలే బంగార్రాజు ఇంట్లో ఈ నెల 17న చోరీ జరిగింది. దుండగులు నగదు, బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. దీనిపై బాధితుడు బంగార్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నేరంతో సంబంధం ఉన్న అన్నదేవరపేట గ్రామానికే చెందిన జాలే బాల గంగాధర్, అతని స్నేహితుడు ఆకాశపు సతీష్‌కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.70 వేల నగదు, సుమారు రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వెంకటరమణ తెలిపారు. నిందితులను కొవ్వూరు కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

• జయహో ఇస్రో



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు నల్లజర్ల మండలంలోని దూబచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బుధవారం చంద్రయాన్- 3 ఆకారంలో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. – నల్లజర్ల